# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఈరోజు రాష్ట్రంలో పర్యటిస్తారు.**
2. **భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయీ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**
3. **రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఈరోజు జరుగుతోంది.**
4. **చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని రహదారులు, భవనాల శాఖమంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు.**
5. **యువత ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.**

==========================

ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఈరోజు రాష్ట్రంలో పర్యటిస్తారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

--------------------------

ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళనను అధిగమించవచ్చని ఉపరాష్ట్రపతి సీపీ. రాధాకృష్ణన్ అన్నారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో ప్రపంచ ధ్యాన దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

...వాయిస్ ....30 సెకన్లు

--------------------------

భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయీ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాకినాడలో అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహాన్ని ఆయన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్ మాధవ్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం కాకినాడ పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించారు.

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఈరోజు జరుగుతోంది. రాష్ట్రంలోని 54 లక్షల 7 వేల 663 మంది 5 ఏళ్ల లోపు  పిల్లలకు 38 వేల 267 బూత్‌లలో పోలియో చుక్కలు వేయనున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, ఎన్టీఆర్, బాపట్ల, ప్రకాశం, తిరుపతి, అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలో పార్లమెంట్ సభ్యులు, శాసనసభ సభ్యులు, కలెక్టర్లు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

---------------------------

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని రహదారులు, భవనాల శాఖమంత్రి బిసి జనార్ధన్ రెడ్డి  తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లిలో ఈరోజు ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య సిబ్బంది జిల్లాలో వంద శాతం పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.  ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు మంత్రి సూచిస్తూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

యువత ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కోసం చేపట్టిన 'అభ్యుదయం' సైకిల్ యాత్రను ఆయన నిన్న సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అనంతరం 'డ్రగ్స్ వద్దు – భవిష్యత్తు ముద్దు' అనే నినాదాలతో కూడిన గోడ పత్రికలను మంత్రి ఆవిష్కరించారు.

---------------------------

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు గ్రామీణ పేదలు, వేతన దారుల కుటుంబాలకు మరింత భరోసా కల్పిస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఢిల్లీలో నిన్న జరిగిన చౌదరి చరణ్ సింగ్ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ఈ బిల్లును గ్రామాల అభివృద్ధికి అనుసంధానించనున్నట్లు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన కోసం వ్యవసాయ రంగంలో నిపుణుల సూచనలు, సలహాలను మంత్రిత్వ శాఖ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

చెన్నై, తిరుపతి వెళ్లే వందే భారత్ రైళ్లను తెనాలిలో ఆపాలనే వినతికి అధికారులు సానుకూలంగా స్పందించారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో  నగర పరిధిలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతి పై రైల్వే ఉన్నతాధికారులతో ఆయన నిన్న సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. గుంటూరు నగర పరిధిలోని పలు పై వంతెనల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, కొత్త పై వంతెనలకు కూడా  స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు.

వాయిస్...27 సెకన్లు

---------------------------

రెండు రోజుల దుబాయి పర్యటనలో భాగంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నిన్న దుబాయ్ చేరుకున్నారు. దుబాయ్‌లో 'గ్రీట్ అండ్ మీట్' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రజలకు ఉపయుక్తంగా ఉన్నాయని వివరించారు. దుబాయ్ తెలుగు మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్ మస్ వేడుకల్లోనూ మంత్రి పాల్గొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

భారత్, పాకిస్తాన్ పురుషుల అండర్-19 ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీ గ్రౌండ్‌లో ఈరోజు జరుగుతోంది. మొదట భారత్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్తాన్ జట్టు మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 17 ఓవర్లు 127 పరుగులు చేసి ఒక వికెట్ నష్టపోయింది. అహ్మద్ హుస్సేన్ 39 పరుగులు, సమీర్ మిన్హాస్ 125 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. భారత్ బౌలర్లు హెనిల్ పాటేల్, దీపేష్ దేవేంద్రన్ చెరో ఒక వికెట్ తీశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు తెలియజేశారు.

=====================